


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

బుధవారం | 23 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08


# చిన్నారుల భవిత బుగ్గిపాలు

**రిమ్స్‌లో పసికందుల మృతిపై మంత్రి సీరియస్**

**రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం**

**ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలి**

**రిమ్స్‌ను 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తాం**

**రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**







**అదిలాబాద్, అక్షిత బ్యూరో:** ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి, అగ్నిప్రమాదం జరిగిన నవజాత శిశు వార్డును పరిశీలించారు. ప్రమాద సమయంలో చేపట్టిన సహాయక చర్యలు, చిన్నారుల ప్రస్తుత వైద్య పరిస్థితి, చికిత్స అందుతున్న విధానం, తీసుకున్న తక్షణ చర్యలపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రిమ్స్ అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, రిమ్స్ వైద్యులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, సోమవారం రాత్రి సుమారు 11.40 గంటల సమయంలో రిమ్స్‌లోని నవజాత శిశు వార్డులో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి, ఏసీకి సంబంధించిన ప్లాస్టిక్ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించినట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. అయితే ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర విచారణ అనంతరం పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే రిమ్స్ సిబ్బంది, జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక, పోలీసు శాఖలు సమన్వయంతో స్పందించి, చికిత్స పొందుతున్న నవజాత శిశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ప్రభావిత చిన్నారులకు అత్యవసర వైద్య సేవలు అందించినట్లు ..మిగతా 2లో



# స్మార్ట్ సిటీగా నల్గొండ

**24 గంటలు తాగు నీరు**

**రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు**

**మంత్రి కోమటిరెడ్డి**





**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** నల్గొండ కార్పొరేషన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించి స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దడమే కాక బెస్ట్ కార్పొరేషన్ అవార్డు కూడా అందుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరాభవన్ వద్ద నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పరిశుభ్రతకు సంబంధించి కోటి 1 లక్ష రూపాయల ..మిగతా 2లో

# నాణ్యమైన విద్య అందించాలి

**ఆరోగ్యం విషయంలో రాజీ పడొద్దు**

**మెనూ ప్రకారం భోజనం అందించాలి**

**కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, అక్షిత బ్యూరో:** విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం విషయంలో రాజీ పడొద్దని మెనూ ప్రకారం భోజనం, నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని రేకుర్తిలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ గర్ల్స్- 1 (సీవోయూ, ఎస్ఓయూ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో

# జూరాల నుంచి సాగు నీరివ్వాలి

**కర్ణాటక సీఎం వద్దకు మంత్రుల బృందం**



**దేవరకద్ర, అక్షిత న్యూస్ :** మహబూబ్‌నగర్ జిల్లా రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జూరాల ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా పంట పొలాలకు సాగు నీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డితో పాటు మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ..మిగతా 2లో

## జూరాల నుంచి సాగు నీరివ్వాలి

**మొదటి పేజీ తరువాయి...**

మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జూరాలకు తగినంత నీటి లభ్యత కల్పించేందుకు కర్ణాటక ముఖ్యమంత్రితో చర్చించాలని, రైతుల పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రితో ఫోన్లో మాట్లాడి సాగునీటి అవసరాల దృష్ట్యా ఆల్మట్టి, నారాయణపూర్, జలాశయాల నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సాగునీటి విడుదల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు, మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేల బృందం నేడు కర్ణాటక ముఖ్యమంత్రిని కలిసి సాగు నీటిని విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రిని కోరనున్నారు.

## నాణ్యమైన విద్య అందించాలి

**మొదటి పేజీ తరువాయి...**

తరగతి గదులు కలియ తిరుగుతూ సౌకర్యాలు పరిశీలించారు. ల్యాబ్, లైబ్రరీ, సిక్ రూమ్, హాస్టల్, భోజనశాల పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది వివరాలు, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నీట్, ఐఐటీకి సన్నద్ధమయ్యే ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులతో మాట్లాడారు. ఎలా చదువుతున్నారు

ఏవైనా సమస్యలున్నాయా.. మెటీరియల్ ఇస్తున్నారా హాస్టల్ ఎలా ఉంది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రిజిస్టర్ మైంటైన్ చేస్తూ వివరాలు సరిగా నమోదు చేయాలని ప్రిన్సిపాల్ మౌనిక సోనీని ఆదేశించారు.

విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరిసరాలను శుభ్రం చేయించాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అనంతరం హాస్టల్ భవనానికి వెళ్లి పరిశీలించారు. సమస్యలు తెలుసుకున్నారు. అక్కడ మీరు నిలుస్తుండడంతో డ్రెయిన్ లైన్ సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గురుకులానికి సొంత భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట డీఆర్ఓ, ఇంచార్జి జిల్లా మైనారిటీ ఆఫీసర్ స్వామి, జిల్లా ఉర్దూ ఉర్దూ అధికారి మహమ్మద్ అఖిల్ అహ్మద్, ప్రిన్సిపల్ మౌనిక సోనీ తదితరులు ఉన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం

**తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి**

**సూపర్‌వైజర్ జి. ధనమ్మ**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మండలం లక్ష్మపురం గ్రామ పరిధిలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ మాసం సందర్భంగా మంగళవారం పోషకాహార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి. ధనమ్మ హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలు, తల్లులు , గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తక్కువ ఖర్చుతోనే అధిక పోషక విలువలు లభించే ఆకుకూరలు, పండ్లు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలతో తయారు చేసిన ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకునేలా కుటుంబ సభ్యులు అలవాటు చేసుకోవాలని తెలిపారు. రక్తహీనత నివారణకు పోషకాహారం అవసరం గర్భిణీలు,బాలింతలు, చిన్నారులు, బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి. సునీత, ప్రేమలత నాజీబ్ , రాంమోహన్, వీఓ వరలక్ష్మి తో పాటు అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, కావ్య, ఆశా కార్యకర్తలు గర్భిణీలు, బాలింతలు, తల్లులు, బాలికలు, ఇతర మహిళలు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిత బుగ్గిపాలు

**మొదటి పేజీ తరువాయి...**

పేర్కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం బాధాకరమని మంత్రి తెలిపారు.



మిగిలిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అవసరమైన చోట స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల సహకారాన్ని కూడా తీసుకున్నట్లు వెల్లడించారు. రిమ్స్‌లో మాతా, శిశు సంరక్షణ సేవలను మరింత బలోపేతం చేసేందుకు 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల ప్రసూతి సేవలు, తల్లుల సంరక్షణ, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రస్తుతం రిమ్స్‌లో సుమారు 800 పడకలు ఉన్నాయని, అదనంగా 150 పడకల ఎం సి ఎచ్ భవనం ఏర్పాటు చేయడం ద్వారా రిమ్స్‌ను సుమారు 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రిమ్స్‌లో పలు కొత్త విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా, హిమోఫీలియా వంటి వ్యాధులకు మెరుగైన వైద్యం అందించేందుకు హెమటాలజీ విభాగం, రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



అదేవిధంగా రిమ్స్‌లో పీజీ వైద్య విద్యార్థుల సంఖ్య, ఓపీ, ఐపీ సేవలను పెంచడంతో పాటు పీడియాట్రిక్స్, గైనకాలజీ, రేడియాలజీ తదితర విభాగాల్లో పీజీ సీట్ల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ కోసం నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా లోపాలు, నిర్వహణలో లోపాలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. రిమ్స్‌లో కింది మూడు కీలక సేఫ్టీ ఆడిట్‌లను నిర్వహించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్, ఫైర్ సేఫ్టీ ఆడిట్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్ నిపుణుల కమిటీ నివేదిక, సేఫ్టీ ఆడిట్‌ల ఆధారంగా రిమ్స్‌లో అవసరమైన మరమ్మతులు, అదనపు మౌలిక వసతులు, పునరుద్ధరణ పనులు, కొత్త భవనాల నిర్మాణం, అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలపై సమగ్ర అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని మంత్రి తెలిపారు. రిమ్స్‌లో మెయింటెనెన్స్, మానిటరింగ్, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తామని చెప్పారు. విచారణలో ఎవరి నిర్లక్ష్యం లేదా బాధ్యతారాహిత్యం బయటపడినా, నిబంధనల ప్రకారం తగిన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చాంగ్తూ, డీఎంఏ వాణి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో మంద మకరంద్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో సాధన, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే చిన్నారుల మరణాలు**
**మాజీ మంత్రి జోగు రామన్న**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చోటు చేసుకున్న విషాద ఘటనపై మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి రిమ్స్ ఆసుపత్రిని, అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్య లోపాలు, చెత్త కుప్పలు పేరుకుపోవడం, నిర్వహణలో నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు. రిమ్స్ నుంచి ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించిన చిన్నారులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

మరణించిన చిన్నారుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, విషాదంలో ఉన్న కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని జోగు రామన్న డిమాండ్ చేశారు.

# స్మార్ట్ సిటీగా నల్గొండ

**మొదటి పేజీ తరువాయి...**

వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు వెట్టింగ్ మెషిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇటీవల నల్గొండ కార్పొరేషన్ స్వచ్ఛ అవార్డు అందుకుందని, నూతనంగా ఏర్పాటైన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేయడం జరుగుతున్నదని, ముఖ్యంగా 24 గంటలు తాగునీరు అందించేందుకు 83 కోట్ల రూపాయలతో టెండర్లు కూడా పిలవడం జరిగిందన్నారు. నల్గొండ కార్పొరేషన్లో ఎస్ డి ఎఫ్



నిధులతో 63 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని, అలాగే తక్కిన డివిజన్లలో కూడా రోడ్లతో పాటు, డ్రైన్లు నిర్మిస్తామని, 6 నెలల్లో ఎస్టిపి పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ కు అన్ని రకాల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేసి ఉత్తమ కార్పోరేషన్ అవార్డు కూడా తీసుకుంటామనే నమ్మకం తనకున్నట్టు మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ పరిధిలో 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామని, అలాగే డ్రైనేజీ, ఎస్ టిపి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ,ఆర్ అండ్ బి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# రవాణా శాఖ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలన..**

**దరఖాస్తుదారులతో నేరుగా వివరాల సేకరణ**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్**



నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం, మల్కాపూర్ గేట్ సమీపంలో జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్, అక్కడి పరిపాలనా వ్యవహారాలు, ప్రజలకు అందుతున్న సేవలు, సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను కలెక్టర్ సందర్శించి, ఆయా విభాగాల్లో నిర్వహిస్తున్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు, దరఖాస్తుల వివరాలు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేవలు అందుతున్నాయా లేదా అనే అంశాలను కూడా పరిశీలించారు.

సిబ్బంది విధులకు సకాలంలో హాజరై, సమయపాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలను అనవసరంగా వేచి ఉండేలా చేయకుండా, వారి దరఖాస్తులను నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అధికారి, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

తనిఖీలో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్ కోసం కార్యాలయానికి వచ్చిన ఓ దరఖాస్తుదారుడితో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న తేదీ, దరఖాస్తు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, రుసుముల చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీశారు.

ఆన్‌లైన్‌లో నిర్దేశించిన దరఖాస్తు రుసుము మాత్రమే వసూలు చేస్తున్నారా? అదనంగా ఎలాంటి డబ్బులు చెల్లించాల్సి వస్తుందా? దరఖాస్తు చేసుకుని ఎన్ని రోజులు అయింది? దరఖాస్తు ప్రక్రియలో అధికారులు లేదా సిబ్బంది నుంచి ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా? వంటి అంశాలను దరఖాస్తుదారుడిని అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన రుసుములు మాత్రమే వసూలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తుదారుడికి అవసరమైన సమాచారం స్పష్టంగా అందించి, సేవలను సులభతరం చేయాలని పేర్కొన్నారు.

రవాణా శాఖ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా, నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో సేవలు అందించాలని సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల పనితీరు ప్రజలకు అందించే సేవల ఆధారంగానే అంచనా వేయబడుతుందని, అందువల్ల ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యాలయ నిర్వహణ, రికార్డుల పరిరక్షణ, సిబ్బంది హాజరు, ప్రజలకు సేవలందించే విధానం వంటి అంశాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

తనిఖీ సందర్భంగా గుర్తించిన అంశాలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పారదర్శకంగా, సమయపాలనతో సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వెంట.. జిల్లా రవాణా శాఖ కార్యాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# పరిశుభ్రతే గ్రామ ప్రగతికి మూలం

**తడి, పొడి చెత్త బుట్టలు పంపిణీ చేసిన సర్పంచ్ శాపురం రాణి రాజు...**




లోకేశ్వరం సెప్టెంబర్ 22 అక్షిత న్యూస్ : నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని బామ్ని కె గ్రామ సర్పంచ్ శాపురం రాణి రాజు అన్నారు. మంగళవారం బామ్ని కె గ్రామ పంచాయతీ పరిధిలో తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...గ్రామస్థులందరూ పంచాయతీ అందజేసిన చెత్త బుట్టలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇళ్ల వద్దే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి, చెత్త సేకరణకు వచ్చే పంచాయతీ కార్మికులకు అందజేయాలని కోరారు. తద్వారా గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విట్టల్, జి.పి.ఓ.భీమేష్, ఉప సర్పంచ్,వార్డు సభ్యులు, వి.డి.సి.సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు...

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుభవార్త

**ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులతో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు నిబంధనల సడలింపు**





నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి: ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో లబ్దిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, నిర్మాణంలో ఉన్న ఇళ్లకు నిధులు అందేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అనేక విజ్ఞప్తులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు సానుకూలంగా పరిగణనలోకి తీసుకుని, ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా నిబంధనలను సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పోర్టల్‌లో ఇప్పటికే మంజూరై బేస్‌మెంట్ లేదా అంతకంటే పై స్థాయికి చేరుకున్న ఇళ్లకు ఎల్ 3 నుంచి ఎల్ 1 కేసులకు ఒకేసారి ప్రత్యేక అనుమతి ఇస్తూ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు.

ఈ ప్రత్యేక సడలింపు ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని, భవిష్యత్తులో ఎల్ 3 మంజూరులకు దీనిని ప్రాతిపదికగా పరిగణించరాదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఏర్పడే మొత్తం ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. అదేవిధంగా ఇల్లు మంజూరైనప్పటికీ నిర్మాణం ప్రారంభం కాని వాటిని రద్దు చేసి అర్హులైన వారికి కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## వీర సైనికుడు కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డి త్యాగం చిరస్మరణీయం



ఉప్పల్ అక్షిత ప్రతినిధి, సెప్టెంబర్ 22: వీర సైనికుడు కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డి 49వ జయంతి సందర్భంగా మంగళవారం హబ్సిగూడలోని వీర రాజా రెడ్డి మార్గ్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించి, దేశం కోసం ప్రాణాలను అర్పించిన వీర సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డి చూపిన ధైర్యం, దేశభక్తి, త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఎమ్మెల్యే తెలిపారు. దేశం కోసం పోరాడిన వీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ ప్రాంతానికి చెందిన నివాసితులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొని కెప్టెన్ రాపోలు వీర రాజా రెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**



జడ్చర్ల, అక్షిత న్యూస్: రాజాపూర్ మండలంలోని 10 గ్రామాలకు చెందిన 30 మంది ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులకు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి నేడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో ఇందిరమ్మ ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

## అబ్దుల్లాపూర్ మోక్ష కర్ర గణపతిని దర్శించుకున్న మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్...



లోకేశ్వరం, సెప్టెంబర్ 22 (అక్షిత న్యూస్): నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామంలో వెలసిన ప్రసిద్ధ మోక్ష కర్ర గణపతి ని బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు,ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, మంగళవారం భక్తిశ్రద్ధలతో దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల సుభిక్షం కోసం ప్రార్థించారు.

అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో లోలం శ్యాంసుందర్‌తో పాటు బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపె శ్యాంసుందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నారావు, మాజీ వైస్ ఎంపీపీ సాయన్న, మాజీ సర్పంచ్ దిగంబర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, నాయకులు సంజీవ్, సందీప్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు...

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY

# ప్రజా ప్రభుత్వంలో వరంగల్‌కు కొత్త రూపు తీసుకొస్తాం..



## దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై వాక్యాలు చేస్తే సహించం..

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రం రెడ్డి

**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమ కొండ డీసీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రం రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. సోమవారం రాత్రి 11 గంటల వరకు వరంగల్ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించామని, ప్రతి పనికీ డెడ్‌లైన్ నిర్ణయించి ఎప్పటిలోగా పూర్తి చేయాలో స్పష్టమైన టైమ్‌లైన్ రూపొందించామని తెలిపారు.

మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఆసుపత్రులు, ఫిల్టర్‌బెడ్, దేవాలయాల అభివృద్ధి తదితర కీలక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. వచ్చే నెల దసరాలోపే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రానున్నారని, కాకతీయ యూనివర్సిటీ 50 ఏళ్ల వేడుకలు, ఆర్ట్స్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

జీవోలు ఇచ్చి వదిలేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, నిధులు విడుదల చేసి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తున్నామని నాయిని అన్నారు. మామునూరు విమానాశ్రయానికి గతంలో అవసరమైన అనుమతులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు విడుదల చేసి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిందన్నారు. రాష్ట్రం తన బాధ్యతగా భూమిని సమకూర్చినందున విమానాశ్రయ నిర్మాణం, తదుపరి ప్రక్రియలో కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.

విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలన్నది ప్రజల అభిప్రాయాలతో నిర్ణయించుకోవచ్చని నాయిని అన్నారు. ఒడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌కు సుమారు రూ.550 కోట్ల ప్రాజెక్టు తీసుకొచ్చామని నాయిని తెలిపారు. టెండర్లు పూర్తయ్యాయని, పనులు ప్రారంభ మయ్యాయని, మెటీరియల్ కూడా సైట్‌కు చేరుతోందన్నారు.

## దత్తారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మట్టి గణపతి పూజలు



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం దత్తారం ప్రాథమిక పాఠశాలలో మట్టితో వినాయకుడిని ఎంతో చక్కగా హెడ్మాస్టర్ రాజేందర్ రెడ్డి తయారుచేసి ప్రతిరోజు విద్యార్థినీ విద్యార్థులచే పూజలు జరిపించి భక్తిశ్రద్ధలతో వినాయకుడిని మంగళవారం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రాజేందర్ రెడ్డి విద్యార్థులు విద్యార్థులు అంగన్వాడి టీచర్ ఈ కలమ్మ అంగన్వాడి ఆయా లక్ష్మమ్మ స్కూల్ అటెండర్ ఎం సుధాకర్ , విద్యార్థుల తల్లిదండ్రులు భారత మంజుల తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గద్దపాక పాఠశాలల్లో ఘనంగా 'స్వచ్ఛ సేవా' కార్యక్రమం

### మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కేంద్ర ప్రభుత్వ పిలుపుమేరకు మంగళవారం శంకరపట్నం మండలం గద్దపాక గ్రామం లో 'స్వచ్ఛ సేవా' కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల సంయుక్త ఆవరణలో ఈ కార్యక్రమం ఘనంగా కొనసాగింది.

పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. పచ్చదనం-పరిశుభ్రత ప్రాముఖ్యతను విద్యార్థులకు, గ్రామస్తులకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్: కొయ్యడ పరుశరాములు యాదవ్ ,గ్రామ ఉపసర్పంచ్ జంగా జైపాల్ యాదవ్, వార్డు సభ్యులు పలకల శంకర్, రెడ్డి, ఐరేని ప్రణయ్, బాకారపు వేణు, పున్నం ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి తిరుపతి,జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, అంగన్వాడీ టీచర్ కరుణ, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని కార్యక్రమ ముఖ్య అతిథులు పిలుపునిచ్చారు.

## పోలు పాపిరెడ్డి మృతికి కాంగ్రెస్ నాయకుల సంతాపం



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** నిదానపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుత్త నర్సిరెడ్డి మేనమామ పోలు పాపిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు.ఆయన మృతికి రామన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్‌మోహన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ భిక్షం రెడ్డి, జనకల ప్రభాకర్, గంగుల రాజిరెడ్డి, రామిని రమేష్, ఎండీ అక్రమ్, గొలుసుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కిష్టాపూర్‌లో ప్లాస్టిక్‌కు స్వస్తి!

### పర్యావరణ పరిరక్షణకు స్టీల్ బ్యాంక్ ప్రారంభం

### ఇంటింటికీ చెత్తకుండీల పంపిణీ...

### పరిశుభ్రతపై ఎంపీవో సోలామాన్ రాజ్ అవగాహన...



**లోకేశ్వరం, సెప్టెంబర్ 22 అక్షిత న్యూస్ :** పర్యావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడేందుకు నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం కిష్టాపూర్ గ్రామ పంచాయతీ వినూత్న చర్యకు ఉపక్రమించింది. 'ప్లాస్టిక్ వద్దు.. పరిశుభ్రత ముద్దు' నినాదంతో మంగళవారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించడమే లక్ష్యంగా ఎంపీవో సర్పంచ్ ,గ్రామస్థులు కలిసి అడుగు ముందుకు వేశారు.

గ్రామాల్లో ఏ చిన్న వేడుక జరిగినా ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వంటి డిస్పోజబుల్స్ వాడకం ఎక్కువై, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని.. దీనికి చెక్ పెట్టేలా పంచాయతీ ఆధ్వర్యంలో 'స్టీల్ బ్యాంక్'ను ఏర్పాటు చేసినట్లు ఎంపీవో సోలామాన్ రాజ్,తెలిపారు. గ్రామస్థులు తమ ఇంటి శుభకార్యాలు, ప్రత్యేక వేడుకల సమయంలో ఈ బ్యాంక్ నుంచి స్టీల్ పాత్రలను తీసుకెళ్లి వాడుకోవచ్చని ఆయన వెల్లడించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే దిశగా అధికారులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్ భోజన్నతో కలిసి ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్తకుండీలను పంపిణీ చేశారు.చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ సిబ్బందికి అందించాలని సర్పంచ్ గ్రామస్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీవో సోలామాన్ రాజ్,సర్పంచ్ భోజన్న, పంచాయతీ కార్యదర్శి,వార్డు సభ్యులు పాల్గొన్నారు.ప్లాస్టిక్ రహిత కిష్టాపూర్‌ను తీర్చిదిద్దడంలో తామంతా భాగస్వామ్యం అవుతామని గ్రామస్థులు అంగీకరించి, అధికారులకు హామీనిచ్చారు...

## న్యాయవాదుల సంక్షేమం కోసం 23న రాష్ట్రవ్యాప్తంగా ధర్నా

### న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి: ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్‌రెడ్డి



**రామన్నపేట, అక్షిత ప్రతినిధి :** న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించిన ప్రధాన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 23న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టు కాంప్లెక్స్‌ల ఎదుట నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. రామన్నపేటలో మంగళవారం నిర్వహించిన ఐలు సమావేశంలో మాట్లాడుతూ, ఆగస్టు 15, 16 తేదీల్లో కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జరిగిన ఐలు జాతీయ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానంగా మూడు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కేంద్ర న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టం--2001ను సవరించి, న్యాయవాది మరణం లేదా పదవీ విరమణ సందర్భంలో రూ.25 లక్షలు అందించాలని, న్యాయవాదులకు వైద్య సహాయంగా రూ.5 లక్షలు మంజూరు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు కనీసం ఐదేళ్లపాటు నెలకు రూ.10 వేల స్టైపెండ్ అందించాలని డిమాండ్ చేశారు.న్యాయవాదుల సంక్షేమం కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని మామిడి వెంకట్‌రెడ్డి కోరారు. సమావేశానికి ఐలు జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగతయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యాదాసు యాదయ్య, గడ్డం నరసయ్య, అంకం నరేష్, కిరణ్ కుమార్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే ఆసుపత్రి.. వరుస మరణాలు..
# బాధ్యత ఎవరిది?



### గర్భసంచి ఆపరేషన్‌కు వెళ్లి రుక్మాబాయి మృతి.. కుటుంబ సభ్యుల ఆందోళన

### డాక్టర్ రజనీకాంత్ వైద్య సేవలపై గత ఘటనలతో సహా సమగ్ర విచారణకు డిమాండ్

### రాజకీయ పలుకుబడితో వ్యవహారం సద్దుమణిగేలా చేస్తున్నారంటూ ప్రజల ఆరోపణలు..

**నిర్మల్ అక్షిత బ్యూరో, సెప్టెంబర్ 22:** భైంసా పట్టణంలోని సాయి సుప్రియ ఆసుపత్రిలో గర్భసంచి ఆపరేషన్ అనంతరం తానూర్ మండలం ఝరి (బి) గ్రామానికి చెందిన రుక్మాబాయి (35) మృతి చెందిన ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. వైద్య చికిత్సలో నిర్లక్ష్యం జరిగిందంటూ మృతురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగడం కలకలం రేపింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కడుపునొప్పితో బాధపడుతున్న రుక్మాబాయిని సాయి సుప్రియ ఆసుపత్రిలో డాక్టర్ రజనీకాంత్ దగ్గర చేర్పించారు. పరీక్షలు, స్కానింగ్ అనంతరం గర్భసంచిలో కణితి ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినప్పటికీ మళ్లీ తీవ్ర కడుపునొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకురాగా, స్కానింగ్‌లో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించి మరోసారి ఆపరేషన్ చేసినట్లు సమాచారం. రెండో ఆపరేషన్ అనంతరం ఉదయం రోగిని పరీక్షించినప్పుడు మాట్లాడుతున్నారని, కొద్దిసేపటి తర్వాత ఫిట్స్ రావడంతో అత్యవసర చికిత్స అందించినప్పటికీ మృతి చెందినట్లు వైద్యుడు డాక్టర్ రజనీకాంత్ తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే వరుసగా రెండు ఆపరేషన్లు చేయాల్సి రావడం, చికిత్సలో లోపాలు ఉన్నాయనే అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

**వైద్య బోర్డుతో విచారణ ఎప్పుడు?**

ఈ ఘటన ఒక్కటితోనే పరిమితం కాకుండా, ఇదే ఆసుపత్రిలో ఇదే వైద్యుడు డాక్టర్ రజనీకాంత్ వద్ద గర్భసంచి తదితర శస్త్రచికిత్సలు చేయించుకున్న మరికొందరు రోగులు గతంలో మృతి చెందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో నాలుగు నుంచి ఐదు మరణాలకు కారణమైన సాయి సుప్రియ హాస్పిటల్ అని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ ఘటనలన్నింటికీ వైద్య చికిత్సే కారణమని అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. అందువల్ల ఆరోపణలు, అనుమానాలకు తెరదించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వతంత్ర మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి, డాక్టర్ రజనీకాంత్ వద్ద గతంలో చికిత్స పొందినట్లు చెబుతున్న మరణాలపై కూడా సమగ్ర వైద్య విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి కేసులో చికిత్స రికార్డులు, స్కానింగ్ రిపోర్టులు, ఆపరేషన్ వివరాలు, డిశ్చార్జ్ సమ్మరీ, మరణానికి గల వైద్య కారణాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.

**బాధిత కుటుంబాలకు న్యాయం జరిగిందా?**

గత ఘటనల్లో బాధిత కుటుంబాలకు ఏ విధంగా న్యాయం జరిగింది? వైద్య బోర్డు విచారణ జరిగిందా? ఆరోగ్యశాఖ అధికారులు ఏమైనా చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలు ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

గత ఘటనలపై విచారణలు జరిగి ఉంటే వాటి నివేదికలను ప్రజలకు వెల్లడించాలని, బాధిత కుటుంబాలకు అందించిన పరిహారం లేదా ఇతర సహాయ వివరాలను స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యపరమైన తప్పిదం జరిగిందా లేదా అన్నది నిపుణుల కమిటీ ద్వారా తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

**రాజకీయ అండ ఉందా? ప్రజల్లో అనుమానాలు**

ఇదిలా ఉండగా, డాక్టర్ రజనీకాంత్‌కు కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. ఆసుపత్రికి సంబంధించిన వివాదాలు తలెత్తిన ప్రతిసారీ రాజకీయ పలుకుబడితో వ్యవహారం సద్దుమణిగేలా చేస్తున్నారనే అనుమానాలను కొందరు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు లేదా అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉంది. రాజకీయ నాయకులకు నిజంగా ఈ వ్యవహారాలతో ఏదైనా సంబంధం ఉందా? ఉంటే వారి పాత్ర ఏమిటి? అనే అంశాలపై కూడా అధికారులు వాస్తవాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఆరోగ్యశాఖ నిఘా ఎక్కడ?**

ప్రైవేట్ ఆసుపత్రిలో వరుసగా ఇలాంటి ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించి, గతంలో జరిగినట్లు చెబుతున్న మరణాలపై స్వతంత్ర వైద్య బోర్డుతో విచారణ జరిపి, తప్పిదం తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే డాక్టర్ రజనీకాంత్ ప్రభుత్వ వైద్య సేవలతో పాటు ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు నిర్వహిస్తున్నారనే అంశంపైనా సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం వాస్తవాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. రుక్మాబాయి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, గతంలో ఇలాంటి ఘటనలు జరిగి ఉంటే వాటిపైనా మెడికల్ బోర్డు విచారణ నిర్వహించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రేపటి భవిష్యత్తు కోసం ఆయుర్వేదం



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** “ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతిరోజూ యోగాను ఆచరిద్దాం -- ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం” అని చౌటుప్పల్ ప్రభుత్వ యునాని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రోజ్ మేరీ విద్యార్థులకు సందేశాన్ని అందించారు.

11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్‌లోని తెలంగాణ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కాలేజ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ‘ఆయుష్’ శాఖ ఆధ్వర్యంలో “ రేపటి భవిష్యత్తు కోసం ఆయుర్వేదం” కార్యక్రమంలో భాగంగా యోగా వాక్, యోగా అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా, ధ్యానం, యోగా ఆసనాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నిత్య జీవితంలో యోగాను అలవాటుగా చేసుకోవడం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు ఒత్తిడి నియంత్రణకు సహాయపడుతుందని వివరించారు. విద్యార్థులతో సూర్య నమస్కారాలు, తాడాసనం, వృక్షాసనం, త్రికోణాసనం తదితర యోగా ఆసనాలను సాధన చేయించి వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హేమలత, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఫార్మసిస్ట్ డి. సరిత, యోగా ఇన్‌స్ట్రక్టర్లు వి. ఝాన్సీ, పి. సాత్విక్, ప్రకృతి వైద్య నిపుణులు అశ్విన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కవిత డిగ్రీ కళాశాలలో “ది పారడైజ్” సినిమా ప్రమోషన్



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న ది పారడైజ్ సినిమా ప్రమోషన్ కార్యక్రమం మంగళవారం స్థానిక గట్టయ్య సెంటర్ లోని కవిత డిగ్రీ పీజీ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బర్నింగ్ స్టార్ సంపూర్ణేష్ బాబు (ముఖ్య పాత్ర) హాజరై విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో తామే హీరోలుగా అనుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అలాగే తన త్వరలో విడుదల కానున్న సినిమాను అందరూ చూసి ఘన విజయం చేయాలని కోరారు. పలువురు విద్యార్థులు యువ ఉత్సాహంతో ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ పి. ఉషా కిరణ్ కుమార్ యూజీ ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రాధాకృష్ణ మూర్తి పిజి ప్రిన్సిపాల్ డా. పి. రోజారాణి అధ్యాపక అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థులు పాల్గొని సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందజేయాలి

### గ్రామ సర్పంచ్ కొట్టే తిరుపతయ్య



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** తెలకపల్లి మండల పరిధిలోని జంగమోనిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రామ సర్పంచి కొట్టే తిరుపతయ్య పాఠశాలను సందర్శించి, పాఠశాలలో ఉన్నటువంటి విద్యార్థులతో

మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. రెగ్యులర్గా పాఠశాలకు వచ్చి విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనము అందజేయాలని కోరారు.

# రాష్ట్ర స్థాయి గట్కా పోటీలకు
# అక్షర హైస్కూల్ విద్యార్థి ఎంపిక....!

### నందిపేట్, నిజామాబాద్ జిల్లాకు తొలి గట్కా రాష్ట్ర స్థాయి ఎంపికగా సాయి హర్ష...



**ఆర్మూర్, అక్షితబ్యూరో:** నందిపేట్ మండల కేంద్రంలోని అక్షర హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి శంకుర్ సాయి హర్ష రాష్ట్ర స్థాయి గట్కా క్రీడా పోటీలకు ఎంపికై సత్తా చాటాడు. నందిపేట్ మండలం ఖుద్వన్ పూర్ గ్రామానికి చెందిన సాయి హర్ష, ఖేలో ఇండియా యూత్ గేమ్స్లో భాగంగా గట్కా అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

సాంప్రదాయ సమరకళగా పేరొందిన గట్కా క్రీడలో నందిపేట్ మండలం నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం విద్యార్థి సాయి హర్షకు దక్కిన అరుదైన ఘనతగా నిలిచింది. నందిపేట్, నిజామాబాద్ జిల్లా నుంచి గట్కా క్రీడలో రాష్ట్ర స్థాయికి విద్యార్థి ఎంపిక కావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్న సాయి హర్ష, క్రమశిక్షణతో సాధన చేస్తూ ఈ స్థాయికి చేరుకున్నాడు. సెలక్షన్ ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ డాక్టర్ శ్రీకాంత్ రామావత్, స్కూల్ డైరెక్టర్ దివ్య రామావత్, హెడ్‌మాస్టర్ అందె మహేష్, వైస్ ప్రిన్సిపాల్స్ కొండూర్ శేఖర్, కమలతో పాటు ఉపాధ్యాయులు సాయి హర్షను ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థికి క్రమం తప్పకుండా శిక్షణ అందిస్తూ ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ ట్రెయినర్లు గంగా జమునా, రామరాజులను పాఠశాల యాజమాన్యం, గ్రామస్థులు అభినందించారు.

సాయి హర్ష రాష్ట్ర స్థాయిలో మరింత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో పాటు నందిపేట్, నిజామాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆకాంక్షించారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY

బుధవారం | 23| సెప్టెంబర్| 2026

## మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం....!

### బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం.....!



**ఆర్మూర్, అక్షిత బ్యూరో:** జక్రాన్ పల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల ప్రాధాన్యత ఎంతో ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణకు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివప్రసాద్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఫ్ ఏ, వన సేవకులు తదితరులు పాల్గొన్నారు. "మొక్కలు నాటుదాం -- పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## గణపయ్యలను దర్శించుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు...



**జగిత్యాల అక్షిత ప్రతినిధి- సెప్టెంబర్ 22:** జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య పట్టణంలో వివిధ రూపాలలో కొలువైన గణనాథు లను దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా పలు అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ప్రతి సంవత్సరము మన సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం నిర్వహించుకుంటూ స్వామివారి కృపకు పాత్రులమవుతున్నాము.. ఎంతో శ్రద్ధతో స్వామివారిని పూజించడం వలన మనకు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు ప్రసాదిస్తారని ఈ ఉత్సవాలలో జరిగే అన్నదాన కార్యక్రమం ఎంతోమంది పేదల కడుపు నింపుతుంది.. ప్రతిరోజు స్వామి వారి పేరుపై పేదవారి కడుపు నిండడం ఆనందంగా ఉంది. రాష్ట్రంలో ఎవరు కూడా కడుపు మార్చుకోకుండా ఉండాలంటే సరైన కాలంలో వర్షాలు పడి పంటలు చేతికి రావాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర అభివృద్ధి వైపు ప్రయాణించాలని ఆయన గణనాధుని కోరుకుంటున్నట్లు చెప్పారు.. ఆయన వెంట పిసిసి సెక్రెటరీ ముఖేష్ ఖన్నా, సుశీల్ కుమార్ సింగ్, రాజేష్ ఖన్నా, తిరుపతి, సన్నీ, సంతోష్ తదితరులు ఉన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ శామీర్ పేట్ డివిజన్ దేవరయాంజాల్ కు చెందిన నీరుడి ఆనంద్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 60 వేల చెక్కును మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, కందాళ రాము, స్థానికులు తలగామ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో గణేష్ నవరాత్రుల సందడి ముగింపు

### నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

### నిమజ్జనానికి అధికార యంత్రాంగం సన్నాహాలు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ ఈ నెల 14 న ప్రారంభం అయినా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నేటి తో ముగియనున్నాయి . కరీంనగర్ జిల్లా భక్తిశ్రద్ధలతో సందడిగా మారిన వినాయక మండపాలు నేటి సాయంత్రం నుండి వెలవెల బోనున్నాయి . జిల్లా వ్యాప్తంగా సుమారు 2,000 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో గణేష్ మండపాలు ప్రత్యేకంగా ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు . మండపాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు కరీంనగర్ నగరంలో సుమారు 500 నుంచి 600 వరకు గణేష్ మండపాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహక వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రధాన కూడళ్లు, కాలనీలు, బస్తీలు, వీధుల్లో గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

సాయంత్రం వేళల్లో గణేష్ మండపాలకు భక్తుల రాక పెరుగుతోంది. కుటుంబ సమేతంగా మండపాలను సందర్శిస్తున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుంటున్నారు. యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు మండపాల వద్ద రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉత్సవాలను ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు.

**"నిమజ్జనంపై దృష్టి"**

నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే గణేష్ నిమజ్జన కార్యక్రమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భారీ విగ్రహాలతో పాటు చిన్న విగ్రహాలు కూడా నిమజ్జనానికి తరలివచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జన మార్గాల్లో రహదారులు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలను పరిశీలిస్తున్నారు.

**"భద్రత- ట్రాఫిక్ నియంత్రణ"**

నిమజ్జనం సందర్భంగా భారీగా వాహనాలు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

**"పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు"**

నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులు నిర్ణయించారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేసేలా చర్యలు చేపట్టనున్నారు. భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**"సమన్వయంతో ఏర్పాట్లు"**

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, పారిశుధ్య శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. మండపాల నిర్వాహకులు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల గణేష్ మండపాలు, కరీంనగర్ నగరంలో 500 నుంచి 600 వరకు మండపాలు ఉండటంతో నవరాత్రి ఉత్సవాల సందడి మరింత పెరిగింది. నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

## ఎంబీబీఎస్, హెచ్‌సీఎల్ టెక్‌బీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం...

### అభినందనలు తెలిపిన ప్రజాసంఘాల నాయకులు



**గద్వాల అక్షిత న్యూస్:** అయిజ పట్టణానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడంతో పాటు మరో విద్యార్థి హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన సందర్భంగా మాజీ సైనికుడు ఇటిక్యాల మైరాముడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు.

పులికల్ ప్రభాకర్ స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు సత్యాన్వేష్ (తండ్రి ప్రభాకర్), కళ్యాణ్ రాజ్ (తండ్రి రాజు), గీతిక (తండ్రి రమేష్), అలాగే హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన విద్యార్థి వి.సువాబన్ (తండ్రి వి. రాజు)ను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మీ మాజీ సైనికుడు మైరాముడు మీడియాతో మాట్లాడుతూ...

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దళితులు ఉన్నత విద్యను అభ్యసించాలని, విద్య ద్వారానే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించడం విద్యార్థుల కష్టపడి చదివిన తీరుకు నిదర్శనమని, ఇది గర్వించదగ్గ విషయమన్నారు.

విద్యార్థులు భవిష్యత్తులో వైద్యులుగా స్థిరపడిన అనంతరం సమాజంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయాలని ఆయన సూచించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

అదేవిధంగా హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఎంపికైన విద్యార్థి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, భవిష్యత్తులో సొంతంగా కంపెనీలు స్థాపించే స్థాయికి చేరుకోవాలని మైరాముడు ఆకాంక్షించారు. కష్టపడి చదివి సీట్లు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు దిశానిర్దేశం చేస్తూ ఉన్నత విలువలతో ముందుకు సాగేలా ప్రోత్సహించిన ప్రజాసంఘాల నాయకులకు, ముఖ్యంగా ఆర్మీ మాజీ సైనికుడు మైరాముడుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల విజయాన్ని గుర్తించి సన్మానించడం తమలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభుదాసు, అలెగ్జాండర్, ప్రసంగి, ఇమ్మానేలు, బుచ్చన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక



# సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎం సభ

### లక్ష మందితో విజయవంతం చేయాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** ఈ నెల 30న సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను లక్ష మందితో విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీఎం సభ సిరిసిల్లలో ఉందంటే మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లో వణుకు మొదలైందని ఆయన వ్యాఖ్యానించారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల చేనేత రంగం, వేములవాడ రాజన్న ఆలయం, సాగునీటి ప్రాజెక్టులు, జిల్లా అభివృద్ధికి చేసిన కృషిపై ఆ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేటీఆర్, కేసీఆర్ రాజన్న సన్నిధికి వచ్చి గతంలో ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.250 కోట్ల మేర నిధులు కేటాయించి పనులు కొనసాగిస్తోందని తెలిపారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు భూసేకరణకు రూ.80 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

#### చేనేత రంగానికి చర్యలు

గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగానికి రూ.300 కోట్లకు పైగా బకాయిలు మిగిలాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చెల్లించడంతో పాటు నేతన్నలకు పని కల్పించే చర్యలు చేపట్టిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. నేతన్నల రుణమాఫీ కింద సుమారు రూ.49 కోట్లు మాఫీ చేసినట్లు చెప్పారు.

రూ.50 కోట్లతో యార్న్ డిపో ఏర్పాటు చేసి ఇప్పటివరకు సుమారు రూ.69 కోట్ల విలువైన యార్న్‌ను 90 శాతం సబ్సిడీపై అందించినట్లు వివరించారు. గత ఏడాది సుమారు 6.66 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా, ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు సుమారు 4.60 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

#### భూ సమస్యలపై ప్రస్తావన

22ఏ భూముల అంశంలో అర్హులైన పేదలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విప్ తెలిపారు. 22ఏ పరిధిలో ఉన్న పేదల భూములు, ఇళ్ల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. సిరిసిల్లలో భూముల వ్యవహారాలకు సంబంధించిన అంశాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని అన్నారు.

గత బీఆర్ఎస్ పాలనలో ఫామ్‌హౌస్ సంస్కృతి పెరిగిందని ఆరోపించిన ఆది శ్రీనివాస్.. ఎర్రవల్లి, రంగనాయకసాగర్, జన్వాడ తదితర ప్రాంతాల్లోని భూముల అంశాలను ప్రస్తావించారు. ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక రికార్డుల ఆధారంగా వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

#### సభకు భారీగా జన సమీకరణ

సెప్టెంబర్ 30న జరిగే సభకు జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించేలా గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. అవసరమైన బస్సుల సంఖ్యను ముందుగానే తెలియజేస్తే జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం సుమారు రూ.1,000 కోట్ల మేర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, సీఎం పర్యటన సందర్భంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని తెలిపారు.

#### సభా స్థలిని పరిశీలించిన విప్

సన్నాహక సమావేశం అనంతరం ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి సీఎం సభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సభా ఏర్పాట్లు, భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

గత 1,000 రోజుల కాంగ్రెస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణను వెల్లడించేందుకు సెప్టెంబర్ 30 సభ వేదిక కానుందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

## బడుల్లో మౌలిక వసతులు కల్పించాలి



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ పిలుపుమేరకు ప్రభుత్వ స్కూల్ బచావో కార్యక్రమం క్రింద మిర్యాలగూడ డివిజన్ కేంద్రంలోని రెవిన్యూ డివిజన్ కార్యాలయం ముందు విద్యార్థినిలతో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.శంకర్ మాట్లాడుతూ ధర్నా ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పిఎం శ్రీ నిధులు దుర్వినియోగం జరిగాయని ప్రధానోపాధ్యాయులుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు మూడవత జగన్ నాయక్, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, జిల్లా కమిటీ సభ్యులు ప్రసన్న, డివిజన్ కమిటీ సభ్యులు ఝాన్సీ, శివమణి, సమీర్ పాల్గొన్నారు.

## ఇల్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ

### ఇద్దరమ్మా ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

### గ్రామ సర్పంచ్ కొట్టే తిరుపతయ్య



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** ఇల్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని గ్రామ సర్పంచ్ కొట్టే తిరుపతయ్య అన్నారు. మంగళవారం తెలకపల్లి మండల పరిధిలోని జంగమోనిపల్లి గ్రామంలో ఇంద్రమ్మ ఇళ్ల నిర్మాణం కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొట్టే బోజ్జమ్మ, బొందమ్మ , రేణుక, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆదుకుంటుందని అన్నారు . ఇదే కాకుండా మరెన్నో రైతులకు రెండు లక్షల రుణమాఫీ. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.500 కు గ్యాస్ సిలిండర్. ఉచిత విద్యుత్. తదితర పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలను ఆదుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొట్టే తిరుపతయ్య, ఉపసర్పంచ్ ఇంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి ఫర్జానా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, గ్రామ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట డిగ్రీ కళాశాలలో 24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి :** రామన్నపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24, 25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని ఏ డిగ్రీ కళాశాలలోనూ అడ్మిషన్ పొందని విద్యార్థులకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను కొనసాగించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఈ నెల 24, 25 తేదీల్లో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు హాజరై అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రధానాచార్యులు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని కోల్పోకుండా నిర్ణీత తేదీల్లో కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందాలని కోరారు.

# వినాయక నిమజ్జనంపై పోలీసుల పకడ్బందీ నిఘా....!

### జిల్లా వ్యాప్తంగా 572 మందిపై ముందస్తు బైండోవర్ చర్యలు...!

### నిజామాబాద్ డివిజన్‌లో 280, ఆర్మూర్‌లో 175, బోధన్‌లో 117 మంది బైండోవర్..!




**నిజామాబాద్, అక్షిత బ్యూరో:** వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు పకడ్బందీ ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, వారిపై చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ తెలిపారు.

పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానితులు, గతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వ్యక్తులను గుర్తించారు. వారిని సంబంధిత మండల రెవెన్యూ అధికారుల ఎదుట హాజరుపరిచి చట్టపరమైన చర్యల్లో భాగంగా బైండోవర్ చేశారు.

జిల్లా వ్యాప్తంగా మొత్తం 572 మందిపై బైండోవర్ చర్యలు చేపట్టారు. ఇందులో నిజామాబాద్ డివిజన్‌లో అత్యధికంగా 280 మంది, ఆర్మూర్ డివిజన్‌లో 175 మంది, బోధన్ డివిజన్‌లో 117 మంది ఉన్నారు.

వినాయక నిమజ్జన సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలు, అల్లర్లు లేదా ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాలు, రద్దీ ప్రదేశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులు, ప్రజలు శాంతియుతంగా, క్రమశిక్షణతో వ్యవహరించాలని పోలీసులు సూచించారు. నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని, వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ కోరారు.

# ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్

# ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తుంది

### పేదల ఆకలి తీర్చేందుకే సన్న బియ్యం పంపిణీ

### ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**నడిగూడెం, అక్షిత న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చేందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని కోదాడ శాసనసభ్యురాలు నలమాధ ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని కొల్లు కోటయ్య ఫంక్షన్ హాల్ నందు తహా సిల్దార్ మంగ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్డు లేని నిరుపేదలందరికీ నూతనంగా రేషన్ కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. రేషన్ కార్డులు పంపిణీ నిరంతరం కొనసాగే విధంగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అన్ని సౌకర్యాలు ఉండే విధంగా స్మార్ట్ కార్డుగా రేషన్ కార్డు ను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి కార్డుదారుడికి స్మార్ట్ కార్డు అందే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్, ఆర్డీవో సూర్యనారాయణ, స్థానిక సర్పంచ్ దున్నా శ్రీనివాస్ సర్పంచ్ ల ఫోరం కన్వీనర్ బూత్కూరి వెంకటరెడ్డి, సర్పంచులు గోసుల రాజేష్, కంభంపాటి సరిత చైతన్య, వేల్పుల సోమయ్య, దాట్ల నాగేశ్వరరావు, ధారావత్ వరలక్ష్మి వెంకటరమణ, చక్రాల ఉమా పిచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొక్క బిక్షపతి, ఉప సర్పంచ్ లు ఎలుగూరి నాగరాజు, నలమాద వీరబాబు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేషన్ కార్డుదారులు పాల్గొన్నారు..

## భక్తి శ్రద్ధలతో బిఎల్ఆర్ పూజలు



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి, ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీ గణనాథుల విగ్రహాలను మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆయా గణేష్ మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం నిర్వాహకులు, భక్తులతో మాట్లాడి గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ గురించి వివరాలు తెలుసుకున్నారు. గణేష్ ఉత్సవాలు భక్తి, శాంతి, సోదరభావంతో కొనసాగాలని, ప్రజలందరికీ శ్రీగణేశుడి ఆశీస్సులు లభించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా డీసీసీ నూతన అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డికి ఘన సత్కారం..




**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన చిగిరింత పారిజాత నరసింహారెడ్డి ని కాంగ్రెస్ పార్టీ, ఐ ఎన్ టి యు సి, టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు, నాయకురాళ్లు ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన డిసిసి అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ కార్యకర్తలతో సమన్వయంతో ముందు సాగాలని వారు ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా చిగురింత పారిజాత నరసింహారెడ్డి ని నియమించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి కి, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి, మరియు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నల్ల సంజీవ రెడ్డి, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరమల్ల వీరేందర్ గౌడ్, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఏ -బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి, మహేశ్వరం నియోజవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీ సమత, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి , టీపీసీసీ లేబర్ సెల్ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ముద్దంగుల తిరుపతి, టీపీసీసీ లేబర్ సెల్ శేరిలింగంపల్లి నియోజకవర్గం జనరల్ సెక్రటరీ బ్రహ్మానందం నాగరాజ్, ఉమ్మడి మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అడ్వైజర్, మియాపూర్ డివిజన్ మాజీ వార్డు మెంబర్ సంగీత వీరేందర్ గౌడ్, ముద్దంగుల హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు అపోలోలో 126 ఉద్యోగ అవకాశాలు....!

### సెప్టెంబర్ 23న నిజామాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఎంపికలు...



| క్రమ సంఖ్య | కంపెనీ పేరు | ఖాళీలు సంఖ్య/ పని ప్రదేశం | ఉద్యోగం | అర్హత | వయోపరిమితి | జీతం |
|---|---|---|---|---|---|---|

District Employment Officer
District Employment Exchange
Nizamabad

**నిజామాబాద్, అక్షిత బ్యూరో:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డా. వేల్పుల విజేత తెలిపారు. ఇందులో భాగంగా ప్రముఖ అపోలో సంస్థలో మొత్తం 126 ఉద్యోగ ఖాళీలకు అభ్యర్థుల ఎంపిక చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఇందులో 100 ఫార్మసిస్ట్ ఉద్యోగాలు హైదరాబాద్‌లో, మరో 26 ఫార్మసీ అసిస్టెంట్ ఉద్యోగాలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఫార్మసిస్ట్ పోస్టులకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ లేదా ఎం.ఫార్మసీ విద్యార్హతతో పాటు పీసీఐ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. పురుషులు, మహిళలు ఇద్దరూ దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి 25 నుంచి 30 సంవత్సరాల వరకుగా పేర్కొన్నారు.

ఫార్మసీ అసిస్టెంట్ పోస్టులకు ఎస్ఎస్సీ, ఇంటర్ లేదా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలి. మెడికల్ స్టోర్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. పురుషులు, మహిళలు ఇద్దరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 2026 సెప్టెంబర్ 23న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు నిజామాబాద్‌లోని శివాజీ నగర్ జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు.

అభ్యర్థులు తమ వెంట బయోడేటా, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకురావాలని అధికారులు తెలిపారు.

ఈ ఉద్యోగ అవకాశాలను ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి డా. వేల్పుల విజేత కోరారు. మరిన్ని వివరాలకు: 9959456793 9848913160. సంప్రదించాలని అన్నారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్తును అందించాలి

### రైతులకు కరెంట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం...

### చౌటుప్పల్ డి.ఈ కార్యాలయం ఎదుట కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ధర్నా...

### మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**చౌటుప్పల్ / అక్షిత న్యూస్:** వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మునుగోడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చౌటుప్పల్ విద్యుత్ శాఖ డి ఈ కార్యాలయం ఎదుట స్థానిక టిఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రభుత్వం ప్రకటించిన మేరకు విద్యుత్ సరఫరా జరగడం లేదని, విద్యుత్ కోతల కారణంగా రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. బోర్లు, మోటార్లపై ఆధారపడే రైతులకు కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు.

వ్యవసాయానికి వాస్తవంగా ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారో లాగ్‌బుక్‌లో ఉన్న వివరాలను చూపించాలని విద్యుత్ శాఖ అధికారులను కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కోరారు. అయితే అధికారులు వెంటనే స్పష్టమైన వివరాలు వెల్లడించకుండా, సరఫరా వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని, విద్యుత్ సరఫరా సమయాలను పారదర్శకంగా వెల్లడించాలని, కోతలు ఉంటే ముందుగానే రైతులకు సమాచారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ విషయంలో రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన నిలబడుతుందని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, మున్సిపాలిటీ పార్టీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి , సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు మల్లేష్ గౌడ్ , నారాయణపురం మండల పార్టీ అధ్యక్షులు నర్రి నరసింహ, చౌటుప్పల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, రైతులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.